క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : మండలంలోని మురారిచింతల 33కె.వి. విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా హిరోజీపురం, అంబకపల్లె, మురారిచింతల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోండి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలు నీటి వృథా చేయకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పొట్లదుర్తి పెన్నానది, కమలాపురం పంపింగ్ స్టేషన్‌ల నుంచి పైపులైన్ ద్వారా నీరు సరఫరా జరుగుతోందన్నారు. ఈ పైపులైన్ ద్వారా నీటి సరఫరాకు అంతరాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం నూతన కులాయి కనెక్షన్లు నిలిపి వేశామన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు మూడవ రోజు కనుల పండువగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చారణలతో సుదర్శన హోమం, స్త్రీశక్తి హోమం, నవగ్రహ హోమం, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మాడ వీధులలో మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణస్వామి గజ వాహనంపై, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి అశ్వ వాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. కాగా సమీప ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వాముల వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

ఆర్టీపీపీలో కళాజాత ప్రదర్శన

ఎర్రగుంట్ల : ఏవరైన చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆర్టీపీపీలో పోలీసు వారి బృందం ఆధ్వర్యంలో పరివర్తన కళాజాత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ మద్యం, మట్కా, బెటింగ్ జూదాలు అడితే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

ముద్దనూరు : జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 12వ తేదీ నుంచి ముద్దనూరులో నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు. స్థానిక శివాలయం పక్కన మైదానంలో నిర్వహించే జిల్లాస్థాయి టోర్నీలో విన్నర్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రన్నర్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.30వేలు నగదు అందజేస్తారన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే ఒక్కోజట్టు ఎంట్రీ ఫీజు రూ.1500లు చెల్లించాలని, ఇతర వివరాలకు 9948051605, 9347113240 అనే నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : మండల పరిధిలోని అంబవరం, లింగాయపల్లె గ్రామాల్లో శనివారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు వల్లూరు గ్రామ సచివాలయ పరిధిలోని లింగాయపల్లెలో, 3.30 గంటలకు దిగువపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని అంబవరంలో జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాటర్‌ప్లాంటు ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని పోచంరెడ్డిపల్లెలో ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ సౌజన్యంతో నిర్మించిన మినిరల్ వాటర్ ప్లాంటును శుక్రవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. మినరల్ ప్లాంటును ఏర్పాటు చేయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డికి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

చెన్నూరు : స్థానిక మైనార్టీ కాలనీ 2వ వార్డుకు చెందిన నసరుల్లా సతీమణి నూరున్నిసా అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయాన్ని మైనార్టీ నాయకులు అన్వర్ బాషా వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళగా ఆయన పోచమరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దహన సంస్కారాల నిమిత్తం రూ. 5000 ఆర్థిక సాయాన్ని వారికి అందించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

జమ్మలమడుగు : మైలవరం మండలం నవాబుపేట గ్రామంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివగుర్విరెడ్డి, దొడియ విష్ణు, జగదీశ్వరరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని యరమలపల్లె, పోచంరెడ్డిపల్లె గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలకు అర్హులై ఉండి అందని వారు ఉంటే వెంటనే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిమెంటు రోడ్లు, రేషన్ కార్డులు, పక్కాగృహాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సర్పంచు సౌజన్యరెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు జగనన్న

పెద్దముడియం : పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న అందరివాడు అని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని పేటవీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందాయా..లేదా పాలన ఎలా ఉంది అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అన్ని రకాల సంక్షేమ పథకాలు అందాయని ఆయా కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత ఉండి పథకాలు వర్తించకుంటే తమ దృష్టికి తేవాలని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శివశేఖర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, ఎం.శివారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎం.మధుసుదన్‌రెడ్డి, సి.మనోహర్, సర్వేష్‌రెడ్డి, పి.శివప్రసాద్, టి.రామసుబ్బారెడ్డి, బి.చెన్నారెడ్డి, నాగేష్ రెడ్డి, ఎం.రవిశంకర్‌రెడ్డి, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి వెంకటప్ప

పులివెందుల టౌన్ : వైఎస్సార్ లాంటి శిష్యుడిని, గొప్ప పరిపాలనా దక్షుడిని సీఎంగా ఈ రాష్ట్రానికి అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి దివంగత వెంకటప్ప అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం దివంగత వెంకటప్ప 42వ వర్ధంతి సందర్భంగా పులివెందుల వడ్డెర సంఘం, వికలాంగుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని గరండాల్ బ్రిడ్జి వద్ద ఉన్న వెంకటప్ప, వైఎస్సార్ గురుశిష్యుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జయమ్మ కాలనీకి చెందిన కె.రాజు అనే భవన నిర్మాణ కార్మికుడికి వైద్య చికిత్సల కోసం మున్సిపల్ చైర్మన్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, డీఆర్డీఏ ఏపీఎం ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చలపతి, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వడ్డెర సంఘగం నాయకులు, వికలాంగులు, తదితరులు పాల్గొన్నారు.


వెంకటప్ప, వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

మొక్కలే మానవాళికి జీవనాధారం

కమలాపురం : మొక్కలే మానవాళికి జీవాధారం అని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.అశోక్‌కుమార్, సి.అయ్యవారప్పల నేతృత్వంలో కళాశాలలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలే మానవాళికి జీవాధారం అని మొక్కలు లేనిదే మనుషులకు జీవనం లేదన్నారు.


మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఫోన్ చేస్తే చాలు స్పందిస్తా

–ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఫోన్ చేస్తే చాలు వెంటనే స్పందిస్తానని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరులో శుక్రవారం మసీదులో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం స్థానిక సమస్యలను గురించి వారితో చర్చించారు. వల్లూరు ముస్లిం స్మశాన వాటిక ఆక్రమణలకు గురయ్యే అవకాశం వున్న నేపథ్యంలో హద్దులు ఏర్పరచి, ప్రహరీ గోడను నిర్మించాలని, అలాగే స్థానిక దర్గాకు ప్రహరీ గోడను నిర్మించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మసీదు కమిటీ చైర్మన్ ఫయాజ్, రసూల్, కరీముల్లా, కరీముల్లా షాద్రీ, మత పెద్దలు, వైఎస్ఆర్‌సీపీ నేతలు కిషోర్‌కుమార్, బాలిరెడ్డి, కరుణాకర్, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.


మసీదులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

ఘనంగా లక్ష్మినరసింహస్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లెలో లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం, గణపతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గరుడసేవ కార్యక్రమం నిర్వహించారు. చెక్కభజన పలువురిని ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండవది రూ.40వేలు, మూడవది రూ.30 వేలు, నాల్గవది రూ.25వేలు, ఐదవది రూ.20వేలు, ఆరవది రూ.15వేలు కార్యనిర్వాహకులు అందజేశారు.

8 నుంచి సమ్మర్ క్యాంపు

పులివెందుల టౌన్ : పులివెందుల గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీనుంచి 11వ తేదీవరకు వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంపు) నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి కృష్ణకిశోర్‌రెడ్డి తెలిపారు. ఈ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, పద్య పఠనం, చిత్ర లేఖనం, స్పోకెన్ ఇంగ్లీషు తదితర తరగతులను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా తేదీలలో ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా వరదరాజులస్వామి కల్యాణం

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపం దేవరకోనలో వెలసిన వరదరాజులస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు పాల్గొని కల్యాణమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజులస్వామి ఉత్సవ మూర్తులకు కిరీటాలు, పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి రోజున స్వామివారికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఊరేగింపుగా దేవరకోనకు తీసుకొచ్చి వేద పండితులు గరుడాద్రి కృష్ణప్రసాద్‌రెడ్డి, సోమశేఖర శర్మల ఆధ్వర్యంలో కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. చెక్కభజనలు భక్తులను అలరించాయి. రాత్రి నిర్వహించిన పంచరత్నాలు పౌరాణిక నాటకాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై ఎంపీకి వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో వెలిదండ్ల పంచాయతీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తాతిరెడ్డిపల్లె, అక్కులగారిపల్లె, చిన్నకుడాల గ్రామాల సర్పంచ్‌లు మల్లికేశ్వరరెడ్డి, నాగేంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్ణా రమేష్‌కుమార్‌రెడ్డి, గండి క్షేత్ర బోర్డు మెంబర్ అంకాల్‌రెడ్డి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.వి.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ శేషారెడ్డి పాల్గొన్నారు.


వరదరాజులస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


చింతలగంగమ్మ దేవతకు పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అందరికీ మంచి జరగాలి..

చక్రాయపేట : ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని కోరినట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగారపువాండ్లపల్లె వద్ద నూతనంగా నిర్మించిన చింతల గంగమ్మదేవత ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మొలకలపౌర్ణమి సందర్భంగా చింతలగంగమ్మ ఆలయంలో దాన్యాధివాసం, హోమకలిశ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మండలానికి చెందిన ప్రజల సమస్యలను ఆయన తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పులివెందుల ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీ ఆగ్రోస్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాదవీ బాలకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, రుక్మిణి, పార్టీ నేతలు సూర్యనారాయణరెడ్డి, ఉత్తమారెడ్డి, మల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, ప్రసాదరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని ప్రారంభించిన ఎంపీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని నారాయణ కళాశాల సమీపంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రవీన్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన శ్రీసాయి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ బుక్ చేసుకునే వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందించాలన్నారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర వైద్యవిభాగపు కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ హాల్‌గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మొలకల పౌర్ణమి ఉత్సవాలు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో శుక్రవారం మొలకల పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు కుండలలో నవధ్యానాలను పోసి 11రోజులపాటు ఆ కుండీలలో నీరు పోస్తారు. 11వ రోజు మొలకల పౌర్ణమి సందర్భంగా పెద్దలు, పిల్లలు మొలకల కుంపట్లను తలపై పెట్టుకుని చంద్రగిరి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని బావిలో వేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో ఈ వేడుకలన ఘనంగా నిర్వహించారు.

లింగాల : మండలంలో మహిళలు భక్తిశ్రద్ధలతో మొలకల పౌర్ణమి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమావాస్య అనంతరం 12 ధాన్యాలతో కుంపట్లలో మొలక పోసి ప్రతిరోజు నీరు పోసి గౌరమ్మ పాటలు పాడుతూ పౌర్ణమి రోజు వరకు మొలక పెంచుతారు. పౌర్ణమి రోజున గ్రామంలోని మహిళలు కుంపట్లను ఎత్తుకుని డప్పులు, మేళాలతో గౌరమ్మ పాటలు పాడుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ఏపుగా పెరిగిన ఒక మొలక కుంపటిని గౌరమ్మగా నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొలకల కుంపట్లను ఊరు బావుల వద్ద నెలకొల్పి పిల్లలకు, పెద్దలకు గౌరమ్మ ప్రసాదాన్ని అందించారు. మండలంలోని లింగాల, వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె, బోనాల, అక్కులగారిపల్లె, ఇప్పట్ల తదితర గ్రామాల్లో ఈ వేడుకలను నిర్వహించి ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా శుక్రవారం మొలకల పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మొలకల కుంపట్లను మహిళలు ఎత్తుకుని మేళా తాళాలతో గ్రామంలో తిరిగి మొలక ఎత్తిన కుంపట్లన్ని దేవాలయాలపై పెట్టి గౌరమ్మకు పూజలు నిర్వహించి బావిలో నిమజ్జనం చేస్తారు. మొలకల పౌర్ణమి రోజున భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తొండూరు : ప్రతి ఏడాది వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమిని మొలకల పౌర్ణమిగా ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. శుక్రవారం మొలకల పౌర్ణమి సందర్భంగా మహిళలు, యువకులు, చిన్నపిల్లలు ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. మొలకెత్తిన కుంపట్లను మహిళలు నెత్తిపై పెట్టుకుని గ్రామ నడిబొడ్డున గౌరమ్మ గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని తొండూరు, అగడూరు, కోరవానిపల్లె, సైదాపురం, మడూరు, ఇనగలూరు తదితర గ్రామాల్లో మొలకల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.


పులివెందులలో మొలకల కుంపట్లను తీసుకెళుతున్న మహిళలు, చిన్నారులు


లింగాలలో మొలకల కుంపట్లను ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం (రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పని చేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.సౌజన్య ఆదివారానికి బదులు ఈనెల 8వ తేదీన సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మండల అధికారుల తీరు మార్చుకోవాలి

చక్రాయపేట : మండల సర్వసభ్య సమావేశానికి కూడా అధికారులు సక్రమంగా రాకపోతే ఎలా అని తీరు మార్చుకోవాలని ఎంపీపీ మాదవీ బాలకృష్ణ, సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు రాకుంటే సభను బాయ్‌కాట్ చేస్తామని ముందుగానే ఎంపీడీఓ శివారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే ఫోన్‌లు చేసి అధికారులను రప్పించారు. ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు తన దృష్టికి తెచ్చిన అధికారుల గైర్హాజరు సమస్యపై ఎంపీడీఓ మాట్లాడుతూ సమావేశానికి గైర్హాజరు అయిన వారితో పాటు ఆలస్యంగా వచ్చిన వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బంది తీరుపై సర్పంచ్ వెంకటసుబ్బయ్య మండిపడ్డారు. ఎంపీపీతో పాటు సభ్యులందరూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యులు లీలావతి, వర్ధన, మోహన్‌రెడ్డి, నారమ్మ, కోఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, తహసీల్దారు రాజసింహనరేంద్ర, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మాదవీ బాలకృష్ణ

కల్యాణం కమనీయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవీ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవిసమేత శ్రీవసంతవల్లభ స్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కన్నుల పండువలా స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం తోమాల సేవ, సహస్రనామార్చన, అగ్ని ప్రతిష్ట, నిత్య హోమాలు నిర్వహించి కలశారాధన చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు శతకలశస్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. మూడు రోజులుగా స్వామివార్లకు విశిష్ట పూజలు నిర్వహించి నరసింహస్వామి జయంతిని వేడుకగా నిర్వహించారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

భక్తి శ్రద్ధలతో పుష్పగిరి గిరి ప్రదక్షిణ

వల్లూరు : పుష్పగిరి పుణ్యక్షేత్రంలో బుద్ద పూర్ణిమను పురష్కరించుకుని శుక్రవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ చెన్నకేశవ, శ్రీసంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. దాతలు భక్తులకు అల్పాహారం, మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలి

వైవీయూ: రెజ్లింగ్ క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద ఢిల్లీలో రెజ్లర్లపై పోలీసుల లాఠీచార్జిను నిరసిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడాకారిణులపై వేధింపులకు పాల్పడ్డారన్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలన్నారు. ఒలంపిక్స్‌లో పతకాలు తీసుకువచ్చిన వారికి అండగా నిలవాల్సిన ఫెడరేషన్ అధ్యక్షుడు, వారిపైనే లైంగిక వేధింపులకు పాల్పడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఇనాయతుల్లా, డేవిడ్‌రాజ్, పాములేటి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి, మండల స్పెషలాఫీసర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో శుక్రవారం వలంటీర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకు అందించడంతో పాటు పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హత కలిగి ఉన్న ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందేలా వ్యవస్థను తీసుకోవచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్తాఫ్‌హుస్సేన్, ఈఓపీఆర్డీ విజయబాను, వలంటీర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించారు.

వేకువజామున అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు.

అనంతరం పురవీధుల్లో శివనామస్మరణల మధ్య రథోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ ఈఓ శంకర్ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.



ఎల్లమ్మతల్లి జాతరకు సర్వం సిద్ధం

చెన్నూరు : స్థానిక కేఓఆర్ కాలనీలో ప్రసిద్ధిగాంచిన ఎల్లమ్మతల్లి జాతరకు నిర్వాహకులు సర్వంసిద్ధం చేశారు. శనివారం గ్రామంలో ఎల్లమ్మతల్లి సోదరుడు పోతురాజు ఊరేగింపు, ఆదివారం ఎల్లమ్మతల్లి జాతరను నిర్వహిస్తారు, మొలకల పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి ఆదివారం ఎల్లమ్మతల్లి జాతర నిర్వహిస్తారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి ఆలయం చుట్టూ స్థలానికి దాతల సహకారంతో ప్రహరీ గోడ నిర్మించడమే కాకుండా గోడలపై దేవతల రూపాలను పెయింటింగ్ వేయడం ఎంతో ఆకర్షణగా ఉందని తెలిపారు. ఇంకా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.


ఎల్లమ్మతల్లి ఆలయం